సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పూర్వ విద్యార్థికి నిత్యావసరాల అందజేత



స్నేహితుడికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదువుకున్న టెన్త్ క్లాస్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. తమతో పాటు అదే పాఠశాలలో చదువుకున్న కోరాడకు చెందిన బసా రమణారెడ్డి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మిత్రులు స్పందించారు. తమ సహచర విద్యార్థిని ఆదివారం పరామర్శించారు. నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో సిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరెడ్డి, పెదపూడి వాసు, బలివాడ శ్రీను, సన వాసు, ధర్మాల శ్రీను, కరణం సతీష్, నంబాల అప్పలరాజు, రాంబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓం శక్తి పూజలు



ఓం శక్తి అమ్మవారిని దర్శించుకుంటున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి యాదవవీధి వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో ఓం శక్తి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఓం శక్తి అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు అమ్మవారి ప్రసాదం గంజి కుండలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ఓం శక్తి కమిటీ సభ్యులు ఆర్.సి.రాజన్, ఆర్.సి.పాండి, మండా మోహన్, వెంకటేశ్వరరావు, మెడికల్ బాబు, చొప్ప కొండమ్మ, ఎన్నేటి రమణ, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ రమణ, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి విరాళం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దల్లివానిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న నూకాంబిక ఆలయానికి 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు గొందేశి సత్యారావు, దల్లి పైడికొండకు రూ. 25 వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి జ్యోతిరెడ్డి, అప్పన్న రెడ్డి, అచ్చన్నరెడ్డి, చుక్క సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల ఈకార్యక్రమం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో క్రతువు ప్రారంభించారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
✆ 7997958388, 9912440606

గూడు లేదు.. నీడ కానరాదు

శతాబ్దాల చరిత్ర కలిగిన పురాతన ఆలయం.. పూరీ ఆలయ వేద పండితుల వంశానికి చెందిన పండా కుటుంబీకుల సారథ్యంలో కొనసాగుతున్న అగనంపూడి జగన్నాథస్వామి రథానికి నీడ కరవై రక్షణ లేకుండా పోయింది. 1830లో అగనంపూడిలో పండా కుటుంబీకుల సారథ్యంలో జగన్నాథుని సత్రం కూడలిలో ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా రథోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపిరచేవారు. దగ్గరలోని సంత ఆశీలు ద్వారా వచ్చిన ఆదాయంతో నిత్య దీప ధూపారాధన, ఆలయ నిర్వహణ చేసేవారు.

- రక్షణ లేక ఎండకు ఎండి.. వానకు తడుస్తున్న జగన్నాథస్వామి రథం
- రథానికి ఆనుకుని వాహనాల పార్కింగ్
- రథం ఎక్కి అపవిత్రం చేస్తున్న అల్లరి మూకలు



రథాన్ని ఆనుకుని వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

అగనంపూడి: ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఇక్కడి జగన్నాథస్వామి రథానికి సరైన రక్షణ లేకుండా పోయింది. 2006 రథోత్సవాల్లో భాగంగా రథాన్ని ఇంద్రద్యుమ్న హాలు వద్ద ఉంచారు. ఒకసారి రాత్రివేళలో లారీ అదుపు తప్పి రథాన్ని ఢీకొట్టడంతో రథం ధ్వంసమైంది. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి దృష్టికి పండా కుటుంబీకులు తీసుకెళ్లడంతో ప్రభుత్వం రూ. 3 లక్షల మేర సహాయం చేయగా, కనకమహాలక్ష్మి ఆలయం, నూకాలమ్మ ఆలయాలు చెరో రూ. లక్ష అప్పుగా ఇచ్చాయి. పండా కుటుంబీకులు రూ.5 లక్షలు, దాతలు మరో మూడు లక్షల వరకు సహాయం చేయగా రూ. 13 లక్షలతో రథాన్ని నిర్మించారు. ఇదిలా ఉండగా ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆలయానికి కేటాయించిన స్థలంలో రథాన్ని ఉంచుతున్నారు. అయితే ఈ రథాన్ని ఆనుకుని పలువురు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో పాటు మందుబాబులు రథం వద్ద మద్యం సేవించి అక్కడే మద్యం బాటిళ్లు పడేస్తున్నారు. కొంత మంది ఆకతాయిలు రథంపై కూడా కూర్చుంటూ అపవిత్రం చేస్తున్నారు. గతంలో తాటాకుల పాక ఉండేది. ఆరేళ్ల క్రితం పాక కూడా శిథిలం కావడంతో ఆరు బయట ఎండ, వానల్లో రథాన్ని వదిలేస్తున్నారు. ఎండకు ఎండి, వానకు తడుస్తూ రథం రంగులు వెలిసిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రథం పూర్తిగా తడిసిపోయింది. ట్రస్ట్ ప్రతినిధులు టార్పాలిన్‌తో కప్పినప్పటికీ ఉపయోగం లేకపోయింది. భారీ వ్యయంతో నిర్మించిన రథానికి గూడు, నీడ లేకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. దేవదాయ శాఖ అధికారులు రథానికి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, పండా కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

షెల్టర్ ఏర్పాటు చేయాలి..

అగనంపూడిలో పురాతన ఆలయానికి చెందిన రథానికి గూడు లేకపోవడం వల్ల ఎండకు ఎండి, వానకు తడుస్తోంది. దీని వల్ల రథం రంగులు వెలిసిపోతున్నాయి. టేకుతో తయారు చేసిన రథం రూపం మారిపోతోంది. వందల సంవత్సరాలు ఉండాల్సిన రథం నీడ లేకపోవడం వల్ల పాడయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎండోమెంట్ అధికారులు స్పందించి తక్షణం షెల్టర్ నిర్మించాలి.

–జి.వెంకటరావు, భక్తుడు

దేవదాయ శాఖ అధికారులను కోరాం..

రథం భద్రపర్చడానికి కేటాయించిన స్థలంలో వసతి ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ అధికారులను కోరాం. ఆరు బయట ఉంచేయటం వల్ల రథానికి రక్షణ లేకుండా పోతోంది. పురాతన చరిత్ర ఉన్న ఆలయం, ఆలయానికి చెందిన రథాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందనే విషయాన్ని అధికారులు గుర్తించాలి.

–జి. మోహన్, అగనంపూడి

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలను అందిస్తున్న సిబ్బంది

గాజువాక: రైజ్ ఆస్పత్రి, ఆర్కే డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చినగంట్యాడలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, రాజాన రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వైద్య సిబ్బంది 350 మందికి దంత, చర్మ, కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పీలా నళిని, బి.జోగేంద్ర, వేగి అవినాష్, పరిమి మీనాక్షి, స్థానిక నాయకులు జి.ఆనంద్, ఎ.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యూసీసీతో మహిళలకు సమాన హక్కులు

సీతంపేట: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) దేశానికి చాలా అవసరమని, దీనిని స్వాగతిస్తున్నామని మానవ వికాస వేదిక అధ్యక్షుడు యు.సాంబశివరావు అన్నారు. ఉమ్మడి పౌర స్మృతిపై ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా వివిధ మతాల్లో ఉన్న ఆచారాలతో మహిళలను అణచివేయడం, వారి హక్కులకు భంగం కలిగించడం మనం చూస్తున్నామన్నారు. ఉమ్మడి పౌర స్మృతి ఉంటే ఈ సమస్యలు ఉండవని, నేడు మహిళల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశించినది లౌకికవాద ఉమ్మడి పౌర స్మృతి అని పేర్కొన్నారు. దీనికి మతాలతో సంబంధం ఉండదని, జీవితం లౌకికమైనదని. ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.









17వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



స్టీల్ సిటీ డిపో వద్ద దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోలో ఎస్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 17వ రోజుకు చేరుకున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షను రీజనల్ కార్యదర్శి నీలకంఠం, డిపో అధ్యక్షుడు రామకృష్ణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని సెక్షన్ల దగ్గర మంచినీటి సదుపాయం కల్పించాలని, 24 మంది కార్మికులకు రావాల్సిన మే నెల జీతం చెల్లించాలని, చట్ట వ్యతిరేకంగా తిరుగుతున్న స్టీల్‌ప్లాంట్ ఒఎంఎస్ సర్వీసులను సరి చేయాలని, ఓటీ సర్వీసులు తగ్గించి రెస్ట్ ఆఫ్, డే అవుట్‌గా చేయాలని డిమాండ్ చేశారు. కె.పి. నాయుడు, ఎల్.ఎస్.రావు, స్వామి, సీహెచ్ రమణ దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో జి. సాయిరామ్, వై.ఆర్. ప్రసాద్, ఎస్.ఎస్. వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆశావాద దృక్పథంతో సాగాలి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆశావాద దృక్పథంతో అడుగేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సూచించారు. ఆదివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మికత వ్యక్తిని ఉన్నతంగా, దృఢంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. లివింగ్ హనుమాన్ పుస్తక రచయిత డాక్టర్ పవనకుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక భావాలు, మేధస్సును కలిగి ఉంటూ కర్మయోగిగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వేదాంత ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బిరేందర్ సింగ్ ఫర్‌త్యల్, బి.వి.కె.చైతన్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మిశ్రాను స్పిరిచ్యువల్ సైంటిస్ట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిషేక్ రచించిన లార్డ్ హనుమాన్–రామ్ కుక్కురా పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ప్రైవేటీకరణతో కార్మిక కుటుంబాలకు భరోసా కరవు



899వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 899వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం చూసీచూడనట్టుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం కార్మికవర్గానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకుని, పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై గోతులతో ప్రమాదాలు



గోతులు పడ్డ శీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వచ్చే సర్వీసు రోడ్డు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ పెట్రోల్ బంక్ నుంచి అక్కిరెడ్డిపాలెం వచ్చే సర్వీసు రోడ్డు గోతులతో ప్రమాదకరంగా తయారయింది. నిత్యం పలువురు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతుల వల్ల ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు చేరడంతో గోతులున్న విషయం తెలియని పలువురు వాహన చోదకులు వాహనాలతో పాటు గోతుల పడి ప్రమాదాలకు గురయ్యారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం దృష్టికి పోర్టు కార్మికుల సమస్యలు



దీక్షా శిబిరంలో కూర్చున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్ ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరవధిక దీక్షలు ఆదివారం 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్మికుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో పలు దఫాలు చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీనిపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి సాయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. స్పందించిన సీఎం వెంటనే చీఫ్ సెక్రటరీతో చర్చించారని, త్వరలోనే యాజమాన్యంతో మాట్లాడనున్నారని తెలిపారు. వచ్చే నెల 1న విశాఖ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో ఈ విషయమై కార్మికులతో మాట్లాడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, నొల్లి తాతారావు, వాసుపిల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, నొల్లి స్వామి, లక్ష్మయ్య, సత్యానందం పాల్గొన్నారు.

గర్భస్థ, శిశు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మందులు, దోమ తెరలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: గర్భస్థ, శిశు ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పావని, హేమలత, విజయలక్ష్మి అన్నారు. గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని టీపీఎస్ కాలనీలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది గర్భిణులు, శిశువులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే ప్రోటీన్ పౌడర్, చక్కీల వంటి బలవర్ధక ఆహారం అందజేసి దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగ అప్పారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చెల్లి రుషికేష్, కార్యదర్శి బాసంగి తిరుపతిరావు, కేవై దాస్, తెంటు సత్యనారాయణ, సత్యంబాబు, చంద్రశేఖర్, గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు చైతన్య యాత్ర



అగనంపూడిలో ఉక్కు చైతన్య యాత్ర నిర్వహిస్తున్న కార్మికులు, నిర్వాసితులు



వడ్లపూడి నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవడమే తమ ధ్యేయమని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో ఆదివారం చేపట్టిన పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. ఉదయం 7 గంటలకు పెదగంట్యాడ జంక్షన్ వద్ద గాంధీ విగ్రహం నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, నిర్వాసితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఉక్కు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలిసికట్టుగా ఉంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పెదగంట్యాడ, నెల్లిముక్కు, సీతానగరం, సమతానగర్, శీకువానిపాలెం, నడుపూరు, చిననడుపూరు, పెదకోరాడ తదితర ప్రాంతాల్లో ఈ పాదయాత్ర సాగింది. నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి శంకరనారాయణ, ఎ.మసేనురావు, టి.రామస్వామి, బొడ్డు పైడిరాజు, మహేశ్వరరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, డి.అప్పారావు, జగదీష్, గణపతి రెడ్డి, జె.ముత్యాలు, పల్లం గోపి, వంశీకృష్ణ యాదవ్, గొందేశి సత్యారావు, మంత్రి గోపినారాయణ, కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

- స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగాలని కోరుతూ మంత్రి రవి ఆధ్వర్యంలో కార్మికులు 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్ నుంచి ఇస్లాంపేట వరకూ పాదయాత్ర చేశారు.

చిన్నారి ఔదార్యం

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమానికి ఓ చిన్నారి తన వంతు సాయం చేసింది. మంత్రి గోపీనారాయణ కుమార్తె చార్మిల తాను దాచుకున్న డబ్బులను డిబ్బీతో సహా మంత్రి రాజశేఖర్‌కు అందజేసింది.

గర్జించిన కార్మిక చైతన్య భేరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించిన కార్మిక చైతన్య భేరిలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 900వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ఆదివారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉక్కునగరం, నిర్వాసిత కాలనీల్లో పెద్ద ఎత్తున పాదయాత్రలు నిర్వహించారు. ఉక్కునగరంలోని సెక్టార్–9 రైతు బజార్ నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి వివిధ సెక్టార్లలో జరిగిన పాదయాత్రలో ఉద్యోగులు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ గత 900 రోజులుగా కార్మికులు నిరాహార దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే దీక్షలు 900 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో అగనంపూడిలో ఉక్కు చైతన్య యాత్ర చేపట్టారు. ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ఆదివారం ఈ పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. కొండయ్యవలస పునరావాస కాలనీలో ప్రారంభమైన పాదయాత్ర దిబ్బపాలెం, దానబోయినపాలెం, పెదమడక, కర్రివానిపాలెం, కొత్తూరు, పినమడక, డొంకాడ, బీసీ కాలనీ, చట్టివానిపాలెం, అట్టవానిపాలెంలో బ్యానర్లతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఉక్కు అఖిల పక్ష నాయకులు కె.సత్యనారాయణరావు, కారు రమణ, పెదిరెడ్ల నీలకంఠం, పెదిరెడ్ల హరనాథ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు, డేవిడ్, చీకటి శ్రీను, సాంబశివరావు, మడగల నరసింగరావు, వంకర రాము, గోవిందరావు, మరిడయ్య పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కార్మిక చైతన్య భేరి పేరుతో కూర్మన్నపాలెం, వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రకమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

